క్లుప్తంగా

భక్తులకు అన్నప్రసాదాలు

నారాయణవనం: తిరుమలకు పాదయాత్రగా వెళ్తున్న గోవిందమాల భక్తులకు సోమవారం స్థానికులు అన్నప్రసాదాలను అందజేశారు. తమిళ ఆడి నెల ప్రారంభం నుంచి వేంకటేశ్వర స్వామికి ప్రీతికరమైన పెరటాసి నెల వరకు చెన్నై నుంచి అధిక సంఖ్యలో భక్తులు గోవింద మాలను ధరించి నారాయణవనం మీదుగా తిరుమలకు నడుచుకుని వెళ్లి మొక్కులు తీర్చుకుంటారు. సోమవారం తిరుమలకు నడుచుకుని వెళ్తున్న చెన్నైకి చెందిన సుమారు 150 మందికి స్థానికంగా ఉంటున్న రేషన్ డీలర్ కందస్వామి, పంచాయతీ అధికారి రవి, కేబుల్ టీవీ ఆపరేటర్ గిరి మధ్యాహ్నం అన్న ప్రసాదాలను అందజేశారు.

బీసీ హాస్టల్ తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

రేణిగుంట: స్థానిక బీసీ బాలుర హాస్టల్‌ను సోమవారం ఉదయం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రభురావు ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థుల గదులు, వంట గది, బాత్రూమ్‌లను ఆయన పరిశీలించారు. టిఫిన్ ఎలా ఉందో రుచి చూశారు. హాస్టల్‌లో వసతుల గురించి విద్యార్థులను ఆరా తీశారు.

మా కాలనీని అభివృద్ధి చేయండి

రేణిగుంట: తమ కాలనీలో తిష్ట వేసిన సమస్యలను పరిష్కరించాలని స్థానిక సచివాలయంలో మండలంలోని జీ.పాల్యం పంచాయతీ పద్మానగర్ వాసులు స్థానిక సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. సిమెంట్ రోడ్డులు, వీధి కాలువలు, వీధిలైట్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. దశలవారీగా పనులు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

క్రమశిక్షణతో చదవండి: డీఎస్పీ



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

రేణిగుంట: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం డీఎస్పీ శ్రీనివాసరావు విద్యార్థులకు సైబర్ నేరాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు..మొదలైన వాటిపై అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల జోలికి వెళ్లరాదని, క్రమశిక్షణతో చదివి తల్లిదండ్రులు, స్కూలుకు మంచిపేరు తేవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ అరుణ్ కుమార్ రెడ్డి, హెచ్ఎం శంకరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీసీరోడ్లు ప్రారంభం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాటూరులో రూ.10 లక్షలతో వేసిన సిమెంట్ రోడ్లను సోమవారం స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ప్రారంభించారు. . డ్రైనేజీ కాలువలు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరారు. అనంతరం గర్భిణులకు సీమంతం చేశారు. ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. ఎంపీడీఓ వెంకటరత్నమ్మ, తహసీల్దారు శ్రీదేవి, పీఆర్ఏఈ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచందనం స్వాధీనం

ఏర్పేడు: మండలంలోని పాయల్‌సెంటర్ సమీపంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఎర్రచందనం దుంగలను సోమవారం ఫారెస్ట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. పాపానాయుడుపేట సెక్షన్ చెల్లూరు ఫారెస్ట్ బీట్ పరిధిలోని పాయల్ సెంటర్ సమాధుల వద్ద తనిఖీలు చేయగా, ముళ్ల పొదల్లో దాచి ఉన్న ఎర్ర చందనం దుంగలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాటి బరువు 157 కిలోలని, రూ.1.33 లక్షలు విలువ చేస్తాయని అధికారులు అంచనా వేశారు. దాడుల్లో ఎఫ్ఆర్వో బి.సుదర్శన్‌రెడ్డి, సెక్షన్ ఆఫీసర్ వై.శంకరప్ప, ఎఫ్‌బీఓ మునెయ్యానాయక్, జ్యోతి, బేస్‌క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సీపీఐ మహాసభ



ర్యాలీ చేస్తున్న సీపీఐ నాయకులు

రేణిగుంట: రేణిగుంటలో సీపీఐ 12వ మహాసభ సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత స్థానిక బస్టాండ్ కూడలి నుంచి సభాస్థలి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మహా సభలో పలు తీర్మానాలను చేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హరినాథ్ రెడ్డి మాట్లాడారు. అనంతరం మండల నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, పార్టీ జిల్లా కార్యదర్శి పి.మురళి, జిల్లా కార్యవర్గ సభ్యుడు రాధాకృష్ణ, నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య, నాయకులు కార్తీక్, సుబ్బరాజు, రమణ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

వరదయ్యపాళెం: విద్యుత్ షాక్‌తో గేదె మృతి చెందిన ఘటన మండలంలో సోమవారం చోటు చేసుకుంది. లక్ష్మీపురం గ్రామానికి చెందిన పాడి రైతు మస్తాన్‌కు చెందిన గేదె మేత కోసం సోమవారం ఉదయం వెళ్తుండగా గ్రామంలో వీధికి ఆనుకుని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ వైరు తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. . రూ.లక్ష విలువ కలిగిన గేదె విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి బలైందని వాపోయాడు. .

తెప్పోత్సవం



హాజరైన భక్తులు



పూజలు చేస్తున్న అర్చకులు



తెప్పలపై విహరిస్తున్న శ్రీవళ్లీ దేవసేన సమేత కుమారస్వామి

శ్రీకాళహస్తి: విజ్ఞానగిరిపై ఉన్న శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ శ్రీవళ్లీ దేవసేన సమేత కుమారస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ఆడికృత్తిక ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి తెప్పోత్సవం ఘనంగా నిర్వహించారు. మొదట స్వామి అమ్మవార్లను అలంకార మండపంలో విశేషంగా అలంకరించి మంగళవాయిద్యాలు, మేళతాళాలు, వేదమంత్రాల నడుమ నారద పుష్కరణి వద్దకు తీసుకువచ్చారు. అక్కడ తెప్పలపై స్వామి అమ్మవార్లను అధిష్ఠించి పూజలు చేశారు. తెప్పపై విహరిస్తున్న శ్రీవళ్లీ దేవసేన సమేత కుమారస్వామిని భక్తులు దర్శించుకున్నారు. ప్రత్యేకించి విద్యుత్ దీపాలంకరణలు ఆకట్టుకున్నాయి. అంతకు ముందు ఉదయం రథంపై ఊరేగారు. కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టును నిరసిస్తూ నేడు నిరసన

బుచ్చినాయుడుకండ్రిగ: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అరెస్టును నిరసిస్తూ మంగళవారం ఉదయం 10 గంటలకు స్థానిక వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద శాంతియూత నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్టు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కొణతనేని మణినాయుడు తెలిపారు. సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ముఖ్య అతిథిగా హాజరవుతారని, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

నేడు అధికారులతో సమీక్ష

వరదయ్యపాళెం: స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మంగళవారం మండల పరిషత్ కార్యాయలంలో అన్నిశాఖల అధికారులతో అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షిస్తారని, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

నేడు ప్రదోష పూజలు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లెలోని శ్రీ సర్వమంగళ సమేత శ్రీపళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు ప్రదోష మండపంలో ప్రదోషపూజలు చేస్తారు. ఈ పూజల్లో పాల్గొనదలచిన వారు రూ.500 చెల్లించాలని అధికారులు తెలిపారు.

విలీనంపై నిరసన

- రాజుగుంట పాఠశాలకు తాళం



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

తొట్టంబేడు: మోడల్ స్కూళ్ల పేరిట కూటమి ప్రభుత్వం చేస్తున్న పాఠశాలల విలీన ప్రక్రియకు స్వస్తి పలకాలని శ్రీకాళహస్తి మండలంలోని రాజుగుంట గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. 3, 4, 5 తరగతులను మన్నవరంలో విలీనం చేయడాన్ని నిరసిస్తూ సోమవారం రాజుగుంట గ్రామ ప్రాథమిక పాఠశాలకు తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. గ్రామానికి మూడు కిలోమీటర్ల అవతల ఉన్న మన్నవరానికి వెళ్లి రావాలంటే మార్గమధ్యంలో అవరోధాలు చాలానే ఉన్నాయని, వర్షాకాలంలో ఏటి కాలువ ఉప్పొంగుతుంటుందని, అలాంటి పరిస్థితుల్లో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని తమ పిల్లలను అక్కడికి పంపాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పారు. విలీన ప్రక్రియ ఆపాలని నెల రోజులుగా అధికారులు, ప్రజా ప్రతినిధుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ స్పందించి విలీన ప్రక్రియను ఆపాలని కోరారు.

రెండు ఆలయాల్లో చోరీ

కేవీబీపురం: మండలంలో మరోసారి దొంగలు రెచ్చిపోయారు. తిమ్మసముద్రం, అరె ఘటనలు మరువక ముందే మరోసారి వేమళపూడిలోని రెండు ఆలయాల్లో దొంగలు పడ్డారు. స్థానికులు కథనం.. వేమళపూడి గ్రామ హరిజనవాడల్లోని ఆలయాల్లో ఆదివారం అర్ధరాత్రి దొంగలు పడ్డి, అమ్మవారి విగ్రహాలకు ఉన్న ముక్కుపుడకలు, చెవి పోగులు తదితర రెండు సవర్ల బంగారు ఆభరణాలను చోరీ చేయడంతోపాటు హుండీలను ధ్వంసం చేసి, సుమారు రూ.70 వేల వరకు నగదు అపహరించారు. స్థానికుల ఫిర్యాదుతో పోలీసులు సంఘటనా స్థలాలను పరిశీలించి, కేసు దర్యాప్తు చేపట్టారు.

పళ్లికొండేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపు

నాగలాపురం: మండలంలోని సర్వమంగళ సమేత శ్రీ పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో సోమవారం తిరుపతి డివిజన్ దేవదాయ శాఖ తనిఖీదారులు పనిరాజశయన్ పర్యవేక్షణలో ఆలయ కార్యనిర్వాహణ అధికారి లత ఆలయంలో హుండీ కానుకలను లెక్కించారు. 54 రోజులకు గానూ హుండీల ద్వారా రూ.5,52,750, అన్నదాన హుండీ ద్వారా రూ.39,843..మొత్తం రూ.5,92,593 ఆదాయం వచ్చిందని లత తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ హనీఫ్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దిరెడ్డిని కలిసిన నేతలు





పెద్దిరెడ్డితో మాట్లాడుతున్న కేవీబీపురం నేతలు, మాజీ మంత్రి పెద్దిరెడ్డితో నారాయణవనం నాయకులు

కేవీబీపురం: ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అరెస్టు తరువాత మండల వైఎస్సార్‌సీపీ నేతలు ఉమ్మడి జిల్లాల కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్‌తో పాటు మండల నేతలు సోమవారం పెద్దిరెడ్డి నివాసంలో కలిశారు. ఎంపీ మిథున్ రెడ్డి అరెస్ట్ పూర్తిగా చంద్రబాబు కుట్రేనని, ఆ తప్పుడు కేసులను సమర్థవంతంగా, ధైర్యంగా ఎదుర్కొందామని వారు తెలిపారు. ఎవరూ ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, త్వరలోనే మిథున్‌రెడ్డి బయటకు వస్తారని పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి ధైర్యం చెప్పారన్నారు. చంద్రబాబు గద్దెనెక్కిననాడే తమను టార్గెట్ చేస్తారని తెలుసని, అన్నింటికీ సిద్ధపడే ఉన్నామని అన్నట్లు తెలిపారు. ఇలాంటి కేసులు మరో మూడేళ్ల పాటు ఎదుర్కోవాల్సిందేనని, అందుకు కూడా సిద్ధంగా ఉన్నట్లు పెద్దిరెడ్డి తమతో చెప్పినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ గవర్ల కృష్ణయ్య, నందకుమార్, లాల్‌బాబుయాదవ్, రామ్మోహన్ వర్మ తదితరులు ఉన్నారు.

పెద్దిరెడ్డిని కలిసిన నారాయణవనం నేతలు

నారాయణవనం: మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని తిరుపతిలోని ఆయన నివాసంలో సోమవారం సాయంత్రం విశ్రాంత జడ్జి దొరస్వామి, పార్టీ జిల్లా క్రియాశీలక కార్యదర్శి రాకేష్ కిరణ్, రాష్ట్ర వాణిజ్య విభాగ సంయుక్త కార్యదర్శి అన్నాదొరై కలిశారు. ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టుపై చర్చించారు.

కాసరంలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల శిబిరం



వైద్య పరీక్షలు చేయడానికి వచ్చిన బృందం

తొట్టంబేడు: తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలో సోమవారం కాసరం పీహెచ్‌సీలో ఉచిత మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల శిబిరం నిర్వహించారు. తొలుత క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, ముందస్తు నివారణ చర్యలపై చిత్రపటాలతో అవగాహన కల్పించారు. బీపీ, మధుమేహం, షుగర్ పరీక్షలతోపాటు పింక్ బస్సులో పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ కోసం పాప్‌స్మియర్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో స్విమ్స్ కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కె.నాగరాజ్, కాసరం వైద్యాధికారులు డాక్టర్ మాధవ్, డాక్టర్ శివకుమార్ రెడ్డి, స్విమ్స్ మెడికలాఫీసర్ డాక్టర్ పద్మావతి, స్థానిక నాయకులు శివరాఘవులు, భాస్కర్ నాయుడు, గిరి, పంచాయతీ కార్యదర్శి ప్రకాష్, పీహెచ్ఎన్ గౌరి, సూపర్‌వైజర్ అమ్మణ్ణమ్మ, ఎంపీహెచ్ఈఓ మహమ్మద్ బాషా, ఎంఎల్‌హెచ్‌పీ జలజ, ఏఎన్ఎం దేవి, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనుల భూములకు పట్టాల కోసం..!

శ్రీకాళహస్తి: మండలంలోని ఎల్లంపల్లిలో 23 ఏళ్లుగా గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి రాయపనేని హరికృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. అనంతరం తహసీల్దారుకు వినతిపత్రం ఇచ్చారు. దీనిపై తహసీల్దార్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో కార్యదర్శివర్గ సభ్యులు పాటూరు వెంకటరత్నం, రామిశెట్టి వెంకయ్య, జిల్లా కమిటీ సభ్యులు జాకీర్, కృష్ణమూర్తి, ఎల్లంపల్లె పోరాట కమిటీ అధ్యక్షుడు బత్తెయ్య, కార్యదర్శి చెంగాల్రాయులు, పోలమ్మ పాల్గొన్నారు

గిరిజనులకు ఇంటి పట్టాలు ఇవ్వాలి



గిరిజనులతో కలిసి ధర్నా చేస్తున్న సీపీఐ నేతలు

సత్యవేడు: మండలంలోని కొత్తమారికుప్పం గిరిజన కాలనీకి చెందిన అర్హులకు ఇంటి పట్టాలు ఇవ్వాలని సత్యవేడు సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్నిరాజ్ కోరారు. సోమవారం తహసీల్దారు కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో గిరిజనులతో కలసి ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ అమాస రెడ్డి కండ్రిగ గిరిజనుల కాలనీలో 150 కుటుంబాల గిరిజనులు నివసిస్తున్నారని, వారిలో 50 కుటుంబాలకు పైగా ఇంటి స్థలాలు లేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఒకే కుటుంబంలో ముగ్గురు, నలుగురికి పెళ్లిళ్లు అయి ఒకే ఇంటిలో నివసిస్తున్నారన్నారు. గిరిజనులకు ఇంటిస్థలాలు ఇవ్వకుంటే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గిరిజనులు స్వప్న, వెంకటలక్ష్మి, మరి, అమ్ములు, వసంత తదితరులు పాల్గొన్నారు.

మోసానికి ట్రేడ్ మార్క్ చంద్రబాబు



పాలమంగళంలో కూటమి ప్రభుత్వ మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తున్న రాజేష్

నారాయణవనం: రేవు దాటకముందు ఓడమల్లన్న, రేవు దాటాక బోడి మల్లన్న చందాన చంద్రబాబు ప్రజల నమ్మకంతో చెడుగుడు ఆడుతున్నారని, మోసానికి ఆయనో ట్రేడ్‌మార్క్ అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ విమర్శించారు. సోమవారం మండలంలోని పాలమంగళం దక్షిణపుకండ్రిగలో పార్టీ మండల కన్వీనర్ సొరకాయలు అధ్యక్షతన జరిగిన బాబు షూరిటీ–మోసం గ్యారెంటీ.. రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. గ్రామ మహిళలతో మాట్లాడి, క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయించి, వారి అభిప్రాయాలను పార్టీ కేంద్రకార్యాలయానికి వాట్సాప్‌లో పంపారు. అనంతరం స్థానిక రామ భజన మందిరం వద్ద జరిగిన సమావేశంలో రాజేష్ మాట్లాడారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబం కూటమి ప్రభుత్వంపై పూర్తి అవిశ్వాసంతో ఉందన్నారు. ఎంపీపీ దివాకర్ రెడ్డి, పార్టీ ముఖ్య నాయకులు భానుప్రకాష్‌రెడ్డి, అన్నాదొరై, రాకేష్‌కిరణ్, రాజారెడ్డి, సుబ్బరాయశెట్టి, సర్పంచ్‌లు సాయిరవి, ధర్మలింగం, తుంబూరు నాగూరు, తిరువట్యం నాగూరు, మురళి, ఎంపీటీసీ సభ్యులు పొన్నుస్వామి, రవి, దేశయ్య, నాయకులు మార్కండేయరెడ్డి, కుందయ్య, బాలాజీ రెడ్డి, పరంధామరెడ్డి, మహేష్, శంకరయ్య, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

రైల్వే యూనియన్ నాయకులకు ఆత్మీయ స్వాగతం



రేణిగుంట: సౌత్ కోస్ట్ రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు ఏకగ్రీవంగా ఎన్నికై రేణిగుంట రైల్వేస్టేషన్ చేరుకున్న నూతన నాయకులకు సీఆర్ఎస్ మజ్దూర్ యూనియన్ నాయకులు ఘనంగా ఆత్మీయ స్వాగతం పలికారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి శంకరరావు, సెంట్రల్ ఆఫీస్ బేరర్లు ఉదయ భాస్కర్, సరోజినీ రెడ్డి, వర్క్ షాప్ డివిజన్ సెక్రటరీ బుచ్చిరెడ్డి, ట్రెజరర్ రమాదేవిలకు సీఆర్ఎస్ మజ్దూర్ యూనియన్ చైర్మన్ సదాశివరెడ్డి, సెక్రటరీ బాబు, ట్రెజరర్ మునికుమార్, రేణిగుంట, తిరుపతి, పాకాల, శ్రీకాళహస్తి, వెంకటగిరి శాఖల కార్యవర్గ సభ్యులు, మజ్దూర్ యూనియన్ నాయకులు, రైల్వే పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కె.కళాధర్, సుదర్శన్, కేశవులు, పరమేశ్వరరాజు, వెంకటముని, ఓబులరాజు తదితరులు స్వాగతం పలికారు. అనంతరం శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వెళ్లారు.

డ్రాపౌట్లను స్కూళ్లలో చేర్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీసీ గౌరీశంకర్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని డ్రాపౌట్లను గుర్తించి తిరిగి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎస్ఎస్ఏ జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ శివశంకర్ ఆదేశించారు. సోమవారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌ను ఆయన ఎస్ఎస్ఏ ఏపీసీ గౌరీశంకర్, డీఈ చంద్రశేఖర్‌తో కలసి సందర్శించారు. పీఎంశ్రీ స్కీం కింద నిర్మించిన కెమిస్ట్రీ ల్యాబ్, కిచెన్ గార్డెన్ రాంప్, ప్లే గ్రౌండ్, స్కూల్‌లో వసతి సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు పాఠాలు అర్థమయ్యే రీతిలో బోధించాలన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెలరోజులు దాటిందని, బడి బయట పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలని, ప్రధానంగా స్కూళ్లలో విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. పిల్లల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం, ప్రధానోపాధ్యాయులు రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

బత్తలవల్లం హైస్కూల్‌లో మినీ సైన్స్ ల్యాబ్



మినీ సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న బ్లూస్టార్ పరిశ్రమ ప్రతినిధులు

వరదయ్యపాళెం: మండలంలోని బత్తలవల్లం జెడ్పీ విద్యార్థులకు సైన్స్‌పై విజ్ఞానాన్ని పెంపొందించేందుకు బ్లూస్టార్ ఏసీ పరిశ్రమ ముందుకొచ్చింది. పరిశ్రమకు చెందిన సీఎస్ఆర్ నిధులు రూ.లక్షతో పాఠశాలలో మినీ సైన్స్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. సోమవారం బ్లూస్టార్ ఫౌండేషన్ ప్రతినిధి నవీన్‌కుమార్, జీఎం స్టాలిన్, ప్లాంట్ హెడ్ రాజశేఖర్, ఏజీఎం రమాదేవి, హెచ్ఆర్ సాయిదీప్తి, ఎంఈఓలు సరస్వతి, గున్నయ్య, హెచ్ఎం జయసుధ చేతుల మీదుగా ఈ ల్యాబ్‌ను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం బ్లూస్టార్ పరిశ్రమ ప్రతినిధులు మాట్లాడుతూ, ల్యాబ్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని సైన్స్‌పై పట్టు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ బందిల కుమార్, ఉపాధ్యాయులు పరంధామయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఆర్ఎస్‌ను రద్దు చేయాలి



రేణిగుంటలో..

రేణిగుంట/తొట్టంబేడు/సత్యవేడు: బాలింతలు, గర్భవతులకు ఇబ్బందికరంగా ఉన్న ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను రద్దు చేసి, తమ సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. సోమవారం రేణిగుంట, తొట్టంబేడు మండల కేంద్రాల్లో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయాల వద్ద, సత్యవేడులో ఎంపీడీఓ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు ఆందోళన చేశారు. అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్షురాలు ధనమ్మ, సీఐటీయూ, ఐఎఫ్టీయూ నాయకులు గురవయ్య, జాకీర్ మాట్లాడారు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాల్లో పలు యాప్‌లు పెట్టాయని, వీటి వల్ల పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి సెల్వరాజ్, అంగన్‌వాడీ యూనియన్ కార్యదర్శి భాగ్య, పాండురంగమ్మ, సెక్టార్ లీడర్లు అంబిక, లీల, గీత, గౌరి, రేఖ, పార్వతి, సీఐటీయూ నాయకులు గంధం మణి, వర్కర్ రేవతి, సత్యవేడు అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్మల, భువన, సుదర్శని, శాంతి, దివ్య, మంజుల, గౌరీ, ప్రమీల పాల్గొన్నారు.

వెట్టి చాకిరి నుంచి విముక్తి



యానాది దంపతులతో రెవెన్యూ అధికారులు

రేణిగుంట: మండలంలోని కరకంబాడి పంచాయతీ తారకరామానగర్‌లో సుమారు రెండేళ్లుగా వెట్టి చాకిరి చేస్తున్న యానాది దంపతులకు తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి చొరవతో విముక్తి కలిగింది. వివరాలు..వెంకటగిరికి చెందిన యానాది దంపతులకు తారకరామానగర్‌కు చెందిన పాపిరెడ్డి బాలకృష్ణ 1,30,000 అప్పుగా ఇచ్చి, వారికి జీతం ఇవ్వకుండా, ఫొటోఫ్రేమ్స్ పనితో వెట్టిచాకిరి చేయించుకున్నట్టు తహసీల్దార్‌కు సమాచారం అందింది. దీనిపై స్పందించిన ఆయన ఆర్ఐ జయకృష్ణ, పోలీస్ సిబ్బందితో సోమవారం అక్కడికి వెళ్లారు. వెట్టి చాకిరీ చేయించుకున్నట్టు తెలుసుకున్నారు. వెట్టిచాకిరీ చేయించుకుంటున్న వ్యక్తికి వార్నింగ్ ఇచ్చారు. యానాది దంపతులను వారి స్వస్థలానికి పంపారు.

మిథున్ రెడ్డి అరెస్టు కక్షపూరితం





నారాయణవనం: దిగువపుత్తూరు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న సమన్వయకర్త రాజేష్, పార్టీ శ్రేణులు, నాగలాపురంలో..

నాగలాపురం/నారాయణవనం: సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతున్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రెడ్‌బుక్ పాలన, కక్షపూరిత రాజకీయాతో వైఎస్సార్‌సీపీ నాయకులను అరెస్టు చేస్తున్నారని సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ విమర్శించారు. ఎంపీ మిథున్ రెడ్డి అరెస్టును నిరసిస్తూ నాగలాపురం బజారువీధిలో టవర్‌క్లాక్ కూడలి వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్ద, నారాయణవనం మండలం పాలమంగళం వద్ద దిగువరోడ్డుపై నూకతోటి రాజేష్ ఆయా మండలాల నేతలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డిని అరెస్టు చేయడం దుర్మార్గమని, ఉమ్మడి మిథున్ రెడ్డిపై లిక్కరు స్కామ్ పేరుతో తప్పుడు కేసు పెట్టి ఎలాగైనా ఆయన్ను జైలు పాలు చేయాలని కంకణం కట్టుకున్నారని ఆరోపించారు. అధికారం మారితే పరిస్థితి ఇంతకు మించి దారుణంగా ఉంటుందని హెచ్చరించారు. మండల అధ్యక్షుడు అపరంజిరాజు, సర్పంచ్ చిన్నదొరై సుధా, ఎంపీపీ సింధూ శ్యామ్, జెడ్పీటీసీ సుమతి మహేష్ రెడ్డి, ఉప సర్పంచ్ సునీత, వైస్ ఎంపీపీ ఉదయ్ కుమార్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ మోహన్ మొదలియార్, జాయిస్ దానివేలు, సీనియర్ నాయకులు భానుప్రకాష్ రెడ్డి, మదన్ మోహన్ రెడ్డి, కులశేఖర్ రెడ్డి, బాబు, సురేష్, ధనరాజ్, చిరంజీవి, దేశప్పన్, ఉదయ్, దేశప్పన, దేశన్, ఈశ్వర్, ముత్తు, నారాయణవనం మండల కన్వీనర్ సొరకాయలు, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, పార్టీ నాయకులు భానుప్రకాష్‌రెడ్డి, అన్నాదొరై, రాకేష్‌కిరణ్, రాజారెడ్డి, సర్పంచ్‌లు సాయిరవి, ధర్మలింగం, తుంబూరు నాగూరు, తిరువ్యం నాగూరు, మురళి, ఎంపీటీసీ సభ్యులు పొన్నుస్వామి, రవి, దేశయ్య తదితరులు పాల్గొన్నారు.